# ★ వెయ్యేళ్ళ పంట ★

బండ్లమూడి శివరామకృష్ణ

"మాటి ఊరికే అన్నారురా ఆ పెద్దాళ్లు- ఏ బాధలైనా పడొచ్చుగాని మారుబిడ్డల బాధ పడలేరని."

"ఇప్పుడు నీకేం కష్టం వచ్చింది శ్యామలా, నిన్నేమైనా వాళ్లు అంటున్నారు గనుకనా?"

"ఇంక అదొక్కటే తక్కువ. రెండురోజులు పోతే ఆ బుద్ధీ తీరుతుందిలే."

"శ్యామలా, ఆ పిల్లలు అమాయకులు చూడు. ఏమీ ఎరుగని ఆ పసిబిడ్డలు నీకే విషయంలో అడ్డువస్తున్నారని అలా అస్తమానం వాళ్ళని చీదరించుకుంటావు?"

"అవును, నా కర్మానికి ఎవరేం చేస్తారు? అందరు బిడ్డల్లా నా బిడ్డకు అచ్చటా ముచ్చటా చూసుకోడానికే లేదు. ప్రతి దానికీ వంతులే. నే చేసుకున్న పాపం."

"శ్యామలా- నీ వేదో ఉదారస్వభావంగల దానవని, అందరిలా కాదని అనుకున్నా. కాని నీ విలా ఉండబోతావని అనుకోలేదు. కాకపోతే ఆపిల్లల మూలంగా నీ కొచ్చిన లోటేమిటి? ఇంకా రెండు రోజులుంటే వాళ్ళ దారిని వాళ్లని ఎవరో తీసుకుపోతారు."

"నేను పడలేను; ఈ ఆరళ్లన్నీ నేను పడలేను. మీరే చేసుకోండి. మీరే ఉండండి. నేను నా పుట్టింటికి పోతాను. ఇంత అన్నమే పెట్టకపోతారా?"

"శ్యామలా, ఎందుకలా ఊరికే ఇదౌతావు! ఇప్పుడు ఏమనుకుంటే మాత్రం వాళ్లు ఎక్కడికి పోతారంటావు? ఇంతకు నన్నేం చేయమంటావు, చెప్పు. ఎప్పుడైనా నీ మాటకు ఎదురు చెప్పానా?"

"మీ రేమీ చెయ్యొద్దు. ఈ అనేమాటలు చాలు. ఇంకేం చెయ్యాలి?"

"మాటలనడమా? అనవసరంగా ఊరికే వాళ్ళ నెందుకు అలా కసురుకోంటూ వనడమే పెద్ద తప్పా?"

"పిన్నీ, ఈ తప్పేలాలో ఉన్న కందిపప్పు ఎందులో పోయమంటావు?"

"నా నెత్తిని పోయండి. అదికూడా చెప్పాలిసిందే. ఇన్ని మాటలు నేర్చిన వాళ్ళకి ఆ పాటి తెలియదేం—ఎందుకు తల్లీ ఈ నటనలన్నీ, ఏం తెలియనట్టు? అవునులే, నేను చెబితే చేయాలని మీకేం అవసరం? నా కెందు కొచ్చిన బాధలే. ఏదో ఇంతపని నేర్చుకోకపోతే రేపు నల్గురూ నన్నే అంటారేమోనని. అదీతప్పేనా!"

"అదికాదు పిన్నీ, అన్నిటిలో అన్నీ వున్నాయి. అందుకని అడిగాను."

"అయ్యో కర్మమా, ఈ నెయ్యంతా ఇలా నేలపాలు చేశారూ! ఈ సంసారం ఇట్లా పోయేదేలే—యెక్కడ దాపరించారో ఈటు బుచ్చడానికి."

"నేనుగాదు పిన్నీ. పిల్లి గుమ్మరించిందిలా వుంది."

"ఇంకానయం తల్లీ—నేనే పారబోసి మీ మీద పెడుతున్నా నన్నావు గావు. ఏమోలే నాకీ యిక్కట్లు విరగడయ్యే యోగం వుందో లేదో."

## 2

"ఏరా చంద్రశేఖరం, ఆ కసుగందుల మాటే ఆలోచించకపోతే ఎలారా? మహాతల్లి-ఆ పిల్లని నరకయాతనలు పెడుతుందట. మొన్న మంగమ్మ చూచి వచ్చిందట-ఆమె చెబుతోంటే పేగులు తరుక్కు పోయాయిరా."

"ఏం చేస్తాం అమ్మా. ఒకళ్ళ ఆడపిల్లల్ని తీసుకొచ్చి సమర్థించుకోడం మాటలా, అమ్మా?"

"ఇక వాళ్ళలా మాడి పోవలసిందే నటరా? నాకన్నమ్మలు ఎంత బాధ పడుతున్నారో? పోయి తీసుకురారా నాయనా, ఏదో కాస్త మంచి సంబంధం చూసి మనమే ముడిపెడితే పోతుందిగా. ఆతల్లి -ఒంటిమీద గుడ్డలు చినిగి పోతేకూడా పట్టించుకోదటరా. అడిగితే కస్సు

మంటుందట. అత డేమో ఆమెగారి చేతుల్లో కీలుబొమ్మ. ఇంతకూ ఆ కసుగందుల కర్మం."

"సరేలే అమ్మా. రేపే పోయి తీసుకువస్తా. అయితే అతను అంత కటికవాడుగా ఎలా మారేడే, అంత మంచివాడుగా వుండేవాడు. అతనైనా కల్పించుకొని, కన్న బిడ్డలు గదా—అవిణ్ణి కొంచెం అదుపులో ఉంచుకో గూడదూ?"

"సరి. బాగుంది నాయనా. ఆతల్లి ఎవరినీ చెలకట్ట నీయదట. ఎట్లా పుట్టిందో మరి! నోరులేని ఆ పిల్ల లేం జేశారనో అంతయిది ఆవిడికి."

"ఇంతకూ రోజులు అలాటివే అమ్మా— పోనీలే, ఆపాటి ఆ పిల్లకు పెళ్లి చేయలేక పోతామా? కాని ఎట్లయినా పరాయి వాళ్లే అంటారు అమ్మా."

## 3

"ఏమిరా చంద్రశేఖరం, అమ్మాయి వివాహ విషయం యీ యేడు తలపెట్టడం లేదా ఏమిటి?"

"అదేమిటే అలా అంటావు? ఊరు కుంటున్నానా? ఈరోజుల్లో ఆడపిల్లలకు పెళ్లి చేయడం మహాయాతన. పిల్లవాడు బుద్ధిమంతుడైతే ఆస్తి వుండదు. ఆస్తివుంటే చదువుండదు; చదువుంటే, అడిగే కట్నాలు అందరానివి."

"నాయనా, ఏదో తిన్ననైన బుద్ధిగలవాడైతేనే నయంరా. అసలే తల్లిలేని పిల్ల. పుట్టినప్పటినుంచీ దానికి ఎప్పుడూ యిక్కట్లే. చేసుకునే వాడైనా సుఖపెట్టేవాడయితే..."

"అందుకే గదూ యింతగా ఆలోచించడం మరి. మీ ఆశలకు అంతులేకపోయె. అన్నీ వున్న వాళ్ళను కదిలించే రోజులు కావయ్యే."

"అయితే ఆ సంబంధం మంచిదే నంటావటరా?"

"అదేమిటే? అలాంటి కుర్రాడు దొరకడం నిజంగా దాని అదృష్టమంటాను. ఎంత తిన్ననైనవాడు! పెద్దవాళ్ళంటే అతని కుండే ఆదరణ; ఆ నిరాడంబరత్వం; ఆ నిదానం;—నిజంగా చాలా మంచివాడని అందరూ చెబుతున్నారు. ఒకరు చెబడం ఏమిటీ, నేనుమాత్రం ఎరగనూ?"

"అట్లా అయితే మరి యింక అనుమానం ఎందుకురా? అంతకంటే కావాలిసిందేమిటంటావురా? నాతల్లి అలాగనన్నా కాస్త సుఖపడే దుంటే దానికీ మనకీ, మంచిదేగా- లే నాయనా, ప్రొద్దుపోయింది భోజనానికి."

## 4

"ఏమండీ చంద్రశేఖరంగారూ, ఆ సంబంధం ఖాయం చేసుకున్నట్టేనా?"

"ఏదండీ, యింకా ఎక్కడ. రాయబారాలు జరుగుతున్నాయి. అంతే. ఇంకా ఏమీ నిశ్చయం కాలేదు.ఇంతకూ ఆసంబంధంగురించి మీఉద్దేశం ఏమిటంటారు మాధవయ్యగారూ?"

"అనడాని కేముంది లెండి, కుదుర్చుకుంటున్నారుగా. కానీయండి."

"అదేమిటి మీరు పెద్దవారు. అటువాళ్ళ విషయం, ఇటు మావిషయం తెలిసినవారు. అంచేత మీ అభిప్రాయం ఈ విషయంలో అవసరం."

"దాని కేం లెండి, ఏముంది. మీరు, ఇంత ఆస్తి ఉన్నవాళ్లుగా చూసి యివ్వా లనుకుంటే మా వూళ్లోనే యింకొక రున్నారు. నిక్షేపం లాంటి ఆస్తి పాతికెకరా లుంది. ఒక్కడే. పాపం మొన్ననే భార్య చనిపోయింది. మొన్నటివాడు. కాదంటే మీ యిష్టం."

"మాధవయ్యగారూ? ఏదో ఈ కుర్రవాడు మంచివాడని, చదువుకున్నాడని చూస్తున్నామండీ."

"ఈ కాలపు మంచి ఏం మంచి లెండి! ఈ చదువులు బువ్వ పెడతాయా? ఏదో యింత పొలావుంటే అది శాశ్వతంగాని, బువ్వకులేని బుద్ధిమంతులు, విద్యావంతులు ఎందుకూ అంటాను. దాని కేం లెండి. ఏదో నాకు తోచింది చెప్పాను. మీ యిష్టం. పోయివస్తానండీ— నే నిలా అన్నానని వాళ్ళతో అనకండి. నేనేదో చెడగొట్టాననుకోబోతారు, గోల."

"సరే, ఆలోచిస్తా ... వుంటానండి—మళ్లీ కలుసుకుందాం."

"అమ్మా, ఆ వూళ్లో మాధవయ్యఅంటే చాలా పెద్దరైతు— మాటకారికూడా."

"అయితే అందరూ ఆ అబ్బాయి కివ్వడం చాలా మంచిదంటుంటే ఈయనేమిటిరా అలా

అంటాడు! అదేదో బాగా చూడు నాయనా; వెయ్యేళ్ళ పంట అన్నారు. తొందర దేనికి.''

''అమ్మా, ఈ పల్లెటూళ్ళలో ఉన్న రోగమే యిది. ఒకరిని చెడగొట్టడం మరొకరికి సరదా. ఈ జబ్బు ఏదో సామాన్య జనానికి ఉంటుందేమో అనుకుంటే ఈ పెద్దవాళ్లకూడా యింతే. ఏదో ఎక్కడో వాళ్లకి వీళ్ళకీ మాట పట్టింపు వచ్చి వుంటుంది. దాంతో ఇలా చాడీలకు తయారు. అసలు అయినా ఒకళ్లు చెప్పేది ఏముంది? వాళ్ళకున్న దేదో వుంది. అతనైనా, ఆ స్త్రీవిషయం అన్నాడేగాని ఆకుర్రవాణ్ణి గురించి యిలా అని అనలేకపోయాడు చూశావా?''

''నిజమేరా. ఇంత ఓర్వలేనితనం ఎందుకో!''

''అయితే వాళ్లు చెప్పేవన్నీ మనల్ని విన మని ఎక్కడుంది?''

''అంతేరా. ఇవన్నీ ఎందుకు - ఎలాగైనా అదే స్థిరపరచుకుంటే మంచిదిరా చంద్రశేఖరం.''

''అదే నేను చూస్తున్నా నమ్మా.''

## 5

''ఏంవమ్మా చుక్కమ్మపాప, మీ మనమరాలు తల్లి లేకుండా మారుతల్లి కింద పడ్డంత కాలం యెన్ని యిక్కట్లు పడినా, వరాలయ్య దొరికాడంటగా - చక్కగా చిలకా గోరింకల్లా వుంటున్నారటగా?''

''అందుకే గదమ్మా, ఆ అబ్బాయే కావాలని యింతగా కోరుకున్నాం.''

''అయితే ఆనాడు అపూరి అతడెవరూ-మాదవయ్యా, గీదవయ్యా - అతడి మాటలు వినకపోవడం చాలా మంచిది గదూ చుక్కమ్మపాప?''

''ఓసి అమ్మాయ్- పైగా ఒక ముసలితొక్కకి యియ్యమని సాయకారాలు చెప్పొచ్చాడే.''

'ఇంకొకళ్ళయితే ఆతడి మాటలు వింటే ఏమయ్యేదో గదా? ఇంతకూ ఆ అమ్మాయి చేసుకున్న పూజ మంచిది.''

'ఏదోలే అమ్మా, పదికాలాలపాటు అట్టా సుఖంగా వుంటే మాకదే పదివేలు.''

''లోకంలో ఓర్వలేనితనం - చిన్నా లేదూ, పెద్దా లేదూ- ప్రతివాళ్ళకీ వుంటుంది కామాలు, చుక్కమ్మపాప? లేకపోతే పెద్దమనిషి కదా అతని కెందుకు యిట్టాంటి మాటలు?''

''దానికేంలే అమ్మాయ్. మంచిని మంచే అనుకుంటారు. చెడును చెడే అనుకుంటారు. ఇది లోకం గదా?''

# కథకుని కర్మసిద్ధాంతం

**'సులోచన'**

చల్లగా వీస్తోంది గాలి. మెల్లగా రేకెత్తుతున్నాయి భావాలు. కాగితం, కలం తీశాడు భాస్కరం ఓ కథ రాద్దామని. కలం కొసను పండ్ల సందున యిరికించి, తల పైకెత్తి, ఇతివృత్తం కోసం వెతుకుతున్నాడు. గతించిన జీవితంలోని మధురానుభూతుల నన్నింటినీ యిదివరకే వ్రాసి పేపర్లకు పంపించడం చేత యితివృత్త నిర్ణయం కొంచెం తామసంగా చెయ్యవలసి వచ్చింది. అలాగే కలాన్ని పండ్ల సందున యిరికించి ఏకాగ్రచిత్తంతో, ఏకాంతంలో కూర్చుని చూస్తున్నాడు భాస్కరం.

మృదువైన రెండు చేతులు తెలియకుండా అతని నయనాల్ని తాకాయి. ఇదివరకే కొంచెం చల్లటిగాలి వీస్తోండటం మూలాన కొంచెం చల్లబడ్డ చెంపలు ఆ కమనీయ హస్తాలు చెంపలను తాకడంచేత మరీ చల్లనై భాస్కరానికి ఎక్కడలేని ఆనందాన్ని చేకూర్చాయి. ''ఎవరబ్బా'' అనే ప్రశ్నకు జవాబు ఎంతకీ తేలకపోడంచేత ఆమె కోమలమైన చేతులను గట్టిగా నొక్కాడు. ఆమె ''ఫలానా?'' అని కనుగొనేందుకు అంతకంటె మంచి ఉపాయం కనిపించింది కాదు. ఎంత నొక్కినా ఆమెకు చలనం కలగకపోటంచేత కాగితం, కలం కింద పెట్టి లేచాడు. ఆ వ్యక్తి తనంత ఎత్తు లేకపోడం చేతనైతేనేమి, వదలవలసి వదలితేనేమి, మొత్తానికి వదలింది. ప్రతిక్రియగా ఆమెను పరిరంభంలోకి లాగుకొని నిర్నిద్రమైన నయనాలను, వికీర్ణమైన ముంగురులను, శోణ రుచులతో ప్రఫుల్ల